ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో సోమవారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంకమోనికుంటకు చెందిన సంజయ్ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.37,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ అనిల్‌కుమార్, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నిరంజన్, సుభాష్, రాజు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మోడల్‌గా కొడంగల్

దేశంలోనే గుర్తింపు వచ్చేలా అభివృద్ధి

అభివృద్ధి పరంగా దేశంలోనే కొడంగల్ నియోజకవర్గాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గత 70 ఏళ్లుగా ఈ ప్రాంతం విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబాటుతనాన్ని ఎదుర్కొందన్నారు. కొడంగల్ ప్రాంతంలో విద్యా, పారిశ్రామికపరంగా అభివృద్ధి పరుగులు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సోమవారం పలువురు రాష్ట్ర మంత్రులు, అధికారులతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొడంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



సీఎంతో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

- ఆడబిడ్డల సంతోషంతోనే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- విద్య, వైద్యం, ఉపాధి, సాగునీటిపై ప్రత్యేక దృష్టి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మొత్తం రూ.103 కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ



కొడంగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు సంతోషంగా ఉంటేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తాపట్నాయక్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి అక్షయ పాత్ర గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌షెడ్ నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మొత్తం రూ.103 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొడంగల్ పట్టణంలోని ఎన్కెపల్లి గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అన్ని రకాల ఉన్నత

మిగతా 7వ పేజీలో...



సీఎం అపర భగీరథుడు: మంత్రి దామోదర

ప్రజా సేవకుడిగా మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అపర భగీరథుడిగా ముందుకు సాగుతున్నారని మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని ఈ ప్రాంత ప్రజలు అదృష్టంగా భావించాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అందుకే సీఎం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి చెప్పారు.

దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ : మంత్రి వాకిటి

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ ప్రాంతం అభివృద్ధి పథంలో సాగుతోందని రాష్ట్ర మంత్రి మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సాగు, తాగునీరు, విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామి కానుందని చెప్పారు. కార్యక్రమంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, రాజేశ్‌రెడ్డి, విజయకుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల బస్సును ప్రారంభిస్తున్న సీఎం, మంత్రులు

బహిరంగ సభ విజయవంతం

కొడంగల్‌లో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. ప్రతీ గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, ప్రధానంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేశారు. సీఎం సభ విజయవంతం.. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా, పోలీస్ ఉన్నతాధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ స్నేహ మెహ్రా



వేదికపై నృత్యం చేస్తున్న మహిళలు

రిజర్వేషన్లు ఖరారు

జిల్లాలో 526 పంచాయతీ స్థానాలు

- ఎస్టీలకు 91, ఎస్సీలకు 106, బీసీలకు 92 స్థానాల చొప్పున కేటాయింపు
- మహిళలకు 247 స్థానాలు రిజర్వు
- ఆశావహుల్లో పెరిగిన పోటీ
- టికెట్ల కోసం అధినాయకుల వద్దకు పరుగులు

సర్పంచ్ స్థానాలు : 526

కేటగిరి	మహిళ	జనరల్
ఎస్టీ	42	49
ఎస్సీ	51	55
బీసీ	42	50
జనరల్	112	125

వార్డు స్థానాలు .. 4668

కేటగిరి	మహిళ	జనరల్
ఎస్టీ	106	153
ఎస్సీ	378	522
బీసీ	379	549
జనరల్	983	1122

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లాలోని 21 మండలాల్లో మొత్తం 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఎస్టీలకు 91 స్థానాలు కేటాయించగా, వాటిలో 42 స్థానాలు మహిళలకు, 49 స్థానాలు ఎస్టీ జనరల్‌గా ఉన్నాయి. అలాగే ఎస్సీలకు 106 స్థానాలు కేటాయించగా, వీటిలో మహిళలకు 51, జనరల్‌కు 55 స్థానాలు కేటాయించారు. బీసీలకు 92 స్థానాలు కేటాయించగా వీటిలో బీసీ మహిళ 42, బీసీ జనరల్ 50 స్థానాలు ఉన్నాయి. అలాగే

మిగతా 8వ పేజీలో...



రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి

ఆదిభట్ల : గత అసెంబ్లీ ఎన్నికలలో నమ్మిన పాపానికి కాంగ్రెస్ పార్టీ బీసీలను స్థానిక ఎన్నికల్లో నిట్టనిలువున ముంచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్ల నిధులు బీసీ సబ్ ప్లాన్ కింద అమలు చేస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టులలో 25శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు 33 శాతం పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేస్తే... కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లి దానిని రద్దు చేయించిందన్నారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి అన్ని విషయాలు తెలిసే ప్రజలను పక్కదారి పట్టిస్తుందని మండిపడ్డారు. 42 శాతం మాట దేవుడెరుగు కనీసం 23 శాతం కూడా అమలు చేయలేదన్నారు. మంచాల మండలంలో 23 సర్పంచుల స్థానాలకు కేవలం రెండు స్థానాలు, యాచారంలో 24 స్థానాలకు కేవలం నాలుగు స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించడం దారుణమన్నారు. డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును ప్రజల ముందు పెట్టకుండా ఇష్టానుసారంగా రిజర్వేషన్లు ప్రకటించడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన స్థానాలు దక్కలేదన్నారు. సమగ్ర రిజర్వేషన్లపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి చట్టం ప్రకారం ఆయా వర్గాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దుబాయ్ పారిపోయేందుకు

వ్యక్తి యత్నం

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టు

శంషాబాద్ రూరల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్ పారిపోయేందుకు యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన సోమవారం ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్‌లో జరిగింది. కేరళకు చెందిన ఇలియాస్ రామన్ కడవత్ అనే ప్రయాణికుడు ఈకే 525 విమానంలో దుబాయ్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే ఎల్‌వోసీ నోటీస్ ఉండడంతో సీఐఎస్ఎఫ్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. అతడిపై కేరళ ధర్మదమ్ పోలీస్ స్టేషన్‌లో 517/2023లో కేసు నమోదై ఉంది. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అరెస్టు చేసిన విషయాన్ని ధర్మదమ్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు వచ్చిన అతడిని అదుపులోకి తీసుకొని కేరళకు తీసుకెళ్లారు.

పరువు హత్యలు దారుణం
● మందకృష్ణ మాదిగ

బ్రిడ్జి లేక ఇక్కట్లు
స్టేషన్ తిమ్మాపూర్ కల్వర్టు వద్ద పొంచి ఉన్న ముప్పు

6



ఆమనగల్లులో రాంచందర్ రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

హామీల అమలుపై కాంగ్రెసోళ్లను నిలదీయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులను ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలు నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకొని మరోమారు రాజకీయంగా లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ సాగిస్తున్న ఎత్తుగడలు ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన కోరారు. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు వెళ్తున్న రాంచందర్ రావుకు ఆమనగల్లు పట్టణం, కడ్తాల మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయా చోట్ల శ్రీశైలం - హైదరాబాద్ జాతీయరహదారిపై పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. ఆయనను అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు రవి నాయక్‌ల తో కలిసి పార్టీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్ విధానాలనే కాంగ్రెస్ అనుసరిస్తుందని ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మోసగించిందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ నాయకులంతా సంఘటితమై మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గడపగడపకూ తీసుకుపోవాలని పిలుపు నిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారం చేపట్టే దిశగా బీజేపీ అడుగులు వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విక్రమ్ రెడ్డి, ఎర్రవోలు శ్రీను, దోనాదుల మహేశ్, చెక్కాల లక్ష్మణ్, గోరటి నర్సింహ్మ, రవీందర్ రెడ్డి, సాయిలాల్ నాయక్, రాందాస్ నాయక్, రవిరాథోడ్, పద్మప్రశాంత్, శ్రీకాంత్ సింగ్, చెన్నకేశవులు, శ్రీనివాస్, రాఘవ, శ్రీశైలం, గంజి శ్రీను, జగన్ రెడ్డి, శ్రీనుయాదవ్, నర్సింహ్మ, ఆనంద్, శేఖర్‌రెడ్డి, శంకర్ నాయక్, మన్యనాయక్, శ్రీశైలం గౌడ్, రెడ్యనాయక్, భగీరథ, తుప్పరి శ్రీను, సిద్దిగారి కుమార్, వెంకటేశ్, సాయి ప్రభు, రాజు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి 40 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. 40 అర్జీలు రాగా, రెవెన్యూకు సంబంధించి 8, ఇతర శాఖలకు సంబంధించి 32 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు..

- » న్యాయమైన పరిహారం అందేలా చూస్తాం
- » రైతుల డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- » ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవి
- » గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ నిర్వాసితులకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందేలా చూస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి హామీ ఇచ్చారు. రైతుల డిమాండ్‌ను రెండు మూడు రోజుల్లో సీఎం రేవంత్ దృష్టికి తీసుకుపోతామన్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే, ఎంపీ పర్యటించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వెళ్లే మార్గాన్ని, భూములు కోల్పోయే రైతుల పొలాలను వారు పరిశీలించారు. అనంతరం ఎక్వాయిపల్లి, ముద్విన్, మర్రిపల్లి, కోనాపూర్, ఆకుతోటపల్లి గ్రామాల భూ నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను వారికి తెలిపారు. కొంగరకలాన్‌లో ఇస్తున్న మాదిరిగా ఎకరాకు రూ. 96 లక్షలు, ఇంటి స్థలం అందించాలని కోరారు. లేదంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని రైతులు స్పష్టం చేశారు. అనంతరం ఎక్వాయిపల్లి గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 5 లక్షలు నిదులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేసి సిగ్నల్ సమస్య లేకుండ చూడాలని ఎంపీని గ్రామస్తులు అభ్యర్థించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో సుజాత, సీఐ గంగాధర్, ఎస్ఐ వరప్రసాద్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతన ర్సింహ్మ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కాంత్ గౌడ్, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరకత శివలింగాన్ని దర్శించుకున్న సినీనటి దివి



శంకర్‌పల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చందిప్పలో ఉన్న మరకత శివలింగాన్ని సోమవారం సినీనటి దివిదర్శించుకున్నారు. శివలింగానికి ఆమె పూజలు, అభిషేకాలు చేశారు. ఆమెకు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌స్వామి, వైస్‌చైర్మన్ శేఖర్ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని లక్ష్మీగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి హాజరయ్యారు. లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ యాటగీత నర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు జగన్, మానయ్య, నర్సింహ, విజయ్, శ్రీను, బాబ, ఫరీద్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రాలతో పర్యావరణ పరిరక్షణ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని, మురుగునీటి శుద్ధికి ఎస్టీపీలు కీలకప్రాత్ర పోషిస్తాయని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. సోమవారం రావిర్యాలలో రూ.25 కోట్లతో నిర్మించే మురుగు నీటి శుద్ధి కేంద్రానికి ఆమె శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే చెరువులు, కుంటల పుణరుద్ధరణ, సుందరీకరణ పనులు భారీగా చేపట్టామని తెలిపారు. రావిర్యాలలోనూ ఎస్టీపీని మంజూరు చేశామని చెప్పారు. రావిర్యాల, జల్పల్లి, మీర్‌పేటల్లోనూ ఇలాంటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెరువులు కబ్జా కాకుండా హద్దురాళ్ల పాతాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు రాజ్‌కుమార్, సుజాత, భానుచందర్, తుక్కుగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య, సురేష్, ఎస్.రాజు, రవినాయక్ పాల్గొన్నారు.

బ్రిడ్జి లేక ఇక్కట్లు

- నీటిపై ప్రమాదకరంగా ప్రయాణం
- స్టేషన్ తిమ్మాపూర్ కల్వర్టు వద్ద పొంచి ఉన్న ముప్పు
- వెంటనే బ్రిడ్జి నిర్మించాలంటున్న స్థానికులు



తిమ్మాపూర్-చేగూర్ రోడ్డులో ఉన్న కల్వర్టు వద్ద వర్షపు నీటి నుంచి వెళ్తున్న వాహనాలు

కొత్తూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్-చేగూర్‌కు రోడ్డులో స్టేషన్‌తిమ్మాపూర్ సమీపంలో ఉన్న కల్వర్టు వాహన చోదకులను భయాందోళనలు కల్గిస్తోంది. కొన్నేళ్ల క్రితం రోడ్డు వేశారు గానీ బ్రిడ్జి నిర్మించలేదు. వర్షపు నీరు కల్వర్టు మీదుగా వెళ్తుంది. ఒంపు ప్రాంతంలో కల్వర్టు వద్ద రోజూ నీరు పారుతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కొత్తూర్, నందిగామ, షాబాద్ మండలాల గ్రామాలకు ఈ కల్వర్టు మీదుగానే వెళ్తున్నారు. ముఖ్యంగా నందిగామలోని కన్హాశాంతి వనానికి నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. రాత్రి సమయాల్లో రోడ్డు నీరు పారుతున్నచోట వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. రోడ్డు కిందికి పడిపోతామోనని భయపడుతున్నారు. రోడ్డు కొట్టుకుపోయి బలహీనంగా మారింది. కొన్నిసార్లు వాహనాలు దిగబడ్డ సందర్భాలూ ఉన్నారు. త్రుటిలో ప్రమాదాలు తప్పాయి. బైక్ రైడర్లు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పరువు హత్యలు దారుణం

● మంద కృష్ణ మాదిగ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

షాద్‌నగర్ రూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పరువు హత్యలు జరగడం దారుణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లిలో హత్యకు గురైన ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. యాదవులు పూజించే శ్రీకృష్ణుడు మాదిగ జాతికి చెందిన జాంబవంతుడి కూతురును వివాహం చేసుకున్నట్లు గుర్తు చేశారు. ఆయనకు లేని కులం ఆయనను పూజించే యాదవులకు ఎందుకని ప్రశ్నించారు. హత్య జరిగిన తరువాత నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపిన పోలీసులు నిందితులకు బెయిల్ రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించి రాజశేఖర్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కోటి రూపాయల పరిహారం ఇవ్వాలన్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మృతుడి కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నర్సింహ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, జాంగారి రవి, దర్శన్, జంగయ్య, డి.రవి పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి భారీగా ఏర్పాట్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, అంజనేయులు, వెంకటేశ్

కడ్తాల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని భూ నీలసమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో డిసెంబరు 6, 7తేదీల్లో సుదర్శన హోమం, మహాకుంబాభిషేకం, పుష్పోత్సవ పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ చైర్మన్ పి.ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు. హోమ కార్యక్రమాల ప్రచారానికి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదపండితుడు వెంకటేశ్వరశర్మ, శ్రీధర్, వేణుగోపాల్, సాయిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను ప్రారంభిస్తున్నమహేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యమని ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, పోచారం మున్సిపాలిటీ, నారపల్లిలో సోమవారం ఆయన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి కాప్రా ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో 14 ఎక్సైజ్ పోలీసుస్టేషన్లను మంజూరు చేసిందన్నారు. అబ్కారీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు స్థలాలు కేటాయించి వాటికి నూతన భవనాలను నిర్మించడానికి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత తెలంగాణను సాధించడానికి ప్రతీఒక్కరు కృషిచేయాలని సూచించారు. మద్యం కల్తీ, మద్యం అక్రమ రవాణా నివారణకు ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని, ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి, నాయకులు ముల్లి జంగయ్యాయాదవ్, బద్దం గోపాల్‌రెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, బద్దం కుమార్, అంజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

మేడ్చల్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీకెమెరాల పాత్ర కీలకమని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన 105 సీసీకెమెరాలను సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారని అన్నారు. అందులో సీసీ కెమెరాలు పోలీసుల దర్యాప్తునకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ తరఫున 75 కెమెరాలు, దాతల సాయంతో మరో 30 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కెమెరాలు రైల్వేస్టేషన్, మైసమ్మగూడ, కేవీరెడ్డి నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ బాలి గంగిరెడ్డి, పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్‌వో విజివర్ధన్, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ పాల్గొన్నారు.

గోపాలస్వామి ఆలయ భూమి స్వాధీనం

పూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని శ్రీగోపాలస్వామి ఆలయ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని చెన్‌గోముల్ గ్రామం సర్వేనంబర్-48లో శ్రీగోపాలస్వామి ఆలయానికి చెందిన 14-21 గుంటల భూమి ఉంది. అట్టి భూమి గత కొంతకాలంగా ఉపయోగంలో లేకపోవడం, అట్టి భూమిపై కొందరి కన్నుపడింది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవ చూపి భూమిని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకునేలా చర్యలు చేపట్టారు. ఈమేరకు సోమవారం దేవాదాయ శాఖ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయ శాఖ తహసీల్దార్ హరిత, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో నరేందర్, పరిశీలకులు మోహన్‌రెడ్డిలు అట్టి భూమిని సందర్శించారు. అనంతరం ఆలయ భూమిలో దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటుందంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పాలన అధికారి టి. సాయికృష్ణ, గ్రామస్తులు కె.సుధాకర్‌గౌడ్, యాదగిరి గౌడ్, నవీన్, బి.నర్సింహులు, మనోహర్‌గౌడ్, రాకేష్, మహేందర్, నరేందర్ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వకపోవడం దురదృష్టకరం

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వకపోవడం దురదృష్టకరమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనను ప్రకటించిన నేపథ్యంలో ముదిరాజ్‌ల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రస్తుత రిజర్వేషన్స్‌కు అనుగుణంగా ముదిరాజులు ఎన్నికలకు సిద్ధమవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముదిరాజ్లను బీసీ-డీ నుంచి బీసీ ఏ గ్రూపునకు మార్చాలన్నారు. డిసెంబరు 1వ తేదీన తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామగ్రామాన మండల కేంద్రాల్లో జిల్లాకేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించుకోవాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాణిక్యం, రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర నాయకులు నర్సిములు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్ష్మణ్, అడ్వకేట్లు లక్ష్మణ్, యాదయ్య, శేఖర్, శరణప్ప, రామస్వామి, వర్షమోని బాబు, బిచ్చన్న, గోపాల్, లాలయ్య పాల్గొన్నారు.

మాధవన్‌జీ హాస్పిటల్‌కు అవార్డుల పంట

మహేశ్వరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాధవన్‌జీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఏకకాలంలో నాలుగు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని, ఇది ఆనందకరం అని మాధవన్‌జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి. తరుణ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అవార్డుల రాకతో హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. తమ ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన నేషనల్ హెల్త్‌కేర్ వెల్నెస్ సంస్థ ఢిల్లీలో తమ వైద్యులకు అవార్డులు అందజేసిందని తెలిపారు. హాస్పిటల్ స్థాపించిన మొదటి ఏడాదిలోనే ఈ అవార్డుల సాధనలో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరి కృషి ఉందని, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. అవార్డులు అందుకున్న వారిలో డాక్టర్లు హిమబిందు, ప్రభాకర్, ఆశికారెడ్డి ఉన్నారు.

ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడాలి



ప్రసంగిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రదీప్

తాండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘమైన పోరాట వారసత్వం విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూకే ఉందని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. తాండూరులో పీడీఎస్‌యూ వికారాబాద్ జిల్లా 4వ మహాసభల సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. జార్జిరెడ్డి, చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోల శంకర్, రంగవల్లి లాంటి విద్యార్థి రత్నాలు త్యాగాలతో గొప్పఆశయాలతో పీడీఎస్‌యూ ఏర్పాటు జరిగిందన్నారు. పీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పి.మహేష్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండేళ్లుగా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడనంగి నాగరాజు, తెలంగాణ లెక్చరర్ల ఫోరం ప్రతినిధి పర్యాద రామకృష్ణ, ప్రముఖ విద్యావేత్త రంగారావు, తెలంగాణ ఉద్యమకారుడు సోమశేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రాజేష్, డివిజన్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

- పేకాట ఆడుతున్న 13 మంది అరెస్టు
- నగదు, మొబైల్స్ స్వాధీనం

కేశంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫామ్ హౌస్‌పై ఎస్‌ఓటీ, కేశంపేట పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పేకాట ఆడుతున్న 13మందిని అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం బైర్‌ఖాన్‌పల్లి, ఖాన్‌పల్లి శివారుల్లోని నిర్మల ఫామ్నిర్మల ఫామ్ హౌస్‌లో సోమవారం పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ నర హరి నేతృత్వంలో దాడిచేశారు. జూదం జరుగుతున్న 13మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పరారైనట్టు సీఐ తెలిపారు. 2.67లక్షల రూపాయలు, 14 మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



మేడ్చల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించి సంబంధితశాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన వినతులపై చర్యలు చేపట్టి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన వినతులను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా సీఎంవో ప్రజావాణి కేసులను సైతం పరిష్కరించాలన్నారు. 126 ప్రజావాణి కార్యక్రమంలో 126అర్జీలు అందినట్లు అడిషనల్ కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్.. ఇద్దరు యువకులు దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. కాగా, సోమవారం ఉదయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన కమల్ టమాట(20), దామర్ టమాట(18)లు ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో ఉంటూ


మృతదేహాన్ని తరలిస్తున్న స్థానికులు

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో బోగారంలోని బంధువుల ఇంటికి యాక్టివా బైక్‌పై బయలుదేరారు. కొండాపూర్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అర్ధ రాత్రి కావడంతో ఎవరూ గుర్తించలేదు. సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే ఇద్దరు యువకులు మృతి చెందారని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోడల్‌గా కొడంగల్

(ఐదో పేజీ తరువాయి)

చదువులు ఒకేచోట అందుబాటులో ఉండే విధంగా కొడంగల్‌ను ఎడ్యుకేషన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దుతామన్నారు.


కిచెన్ షెడ్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం, పక్కన కలెక్టర్‌ప్రతీక్ జైన్, మంత్రులు, ఎమ్మెల్యేలు

ఉపాధి అవకాశాలు పెంచుతాం

కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంతో మరో మూడు సంవత్సరాల్లో కొడంగల్ ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకువచ్చి సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. కొడంగల్ మండలంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. వికారాబాద్ - కృష్ణా రైల్వేలైన్ ఏర్పాటుతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు సాగేలా చేస్తామన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తూ మహిళల ఆత్మగౌరవం పెరిగేలా చేస్తున్నామని తెలిపారు. పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, బస్సుల నిర్వహణతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో బాధపడకూడదని అక్షయపాత్ర సహకారంతో నియోజకవర్గంలో 312 పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందిస్తున్నామన్నారు. అలాగే మధ్యాహ్నం విద్యార్థులకు భోజన పథకం కూడా అమలు చేసేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వాహకులు ప్రభుసత్యదాత చంద్రతో కలిసి గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ నిర్మాణం పనులకు భూమి పూజ చేశామని సీఎం తెలిపారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం రూ.103 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.583 లక్షలు, 23 పాఠశాలల్లో అదనపు తరగతి గదులకు రూ.501 లక్షలు, 10 పంచాయతీ భవనాలకు రూ.300లక్షలు, బంజార భవన్‌కు ప్రహరీ, డైనింగ్ హాల్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.365 లక్షలు, ఫైర్ స్టేషన్‌కు రూ.130 లక్షలు, కొడంగల్‌లో స్విమ్మింగ్ పూల్‌కు రూ.140 లక్షలు, కమ్యూనిటీ హాల్, కిచెన్ షెడ్డు, ప్రహరీ నిర్మాణానికి రూ.491 లక్షలు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.445 లక్షలు, అలాగే రూ.295 లక్షలతో నిర్మించిన తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం చేశారు. కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనులకు రూ.60కోట్లు, రూ.500 లక్షలతో ఆర్ అండ్‌బీ అతిథి గృహం, కోస్గి నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.450 లక్షల విలువ గల పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

అల్పాహారం కిచెన్ షెడ్డు పరిశీలన

కొడంగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో హరే కృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్పాహారం తయారీ కిచెన్ షెడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో నేరుగా కొడంగల్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి మొదట అల్పాహారం తయారీ షెడ్‌ను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లో అత్యాధునిక యంత్రాలతో వంటలు చేసే విధానాన్ని ఫౌండేషన్ నిర్వాహకులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన అల్పాహారం తయారు చేసే యంత్రాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

పెల్లుబికిన ఉత్సాహం

బొంరాస్‌పేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఎన్కెపల్లి గేటు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డిని చూసేందుకు ఆయన అభిమానులు పోలీసులను సైతం నెట్టుకుంటూ ముందుకు వెళ్లారు. మధ్యాహ్నం కొడంగల్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం రోడ్డు మార్గంలో సభాస్థలానికి చేరుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎన్కెపల్లి రోడ్డు వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుకిరువైపులా నినాదాలు చేస్తూ ఉత్సహం నింపారు. కాగా, బహిరంగ సభ ప్రాంగణం వద్ద చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో కనిపించారు.


మంత్రికి మొక్కను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, సిబ్బంది

మెడికల్ కళాశాల నిర్వహణపై ఆరా


- కొడంగల్‌కు తరలిస్తామని మంత్రి హామీ

తాండూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాండూరులో నిర్వహిస్తున్న కొడంగల్ మెడికల్ కళాశాల నిర్వహణ గురించి వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజును అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కొడంగల్‌కు వచ్చిన మంత్రిని ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థులు అందుతున్న సౌకర్యాలు, అవసరమైన పరికరాలపై మంత్రికి వివరించారు. త్వరలో కొడంగల్‌లో ఏర్పాటు చేస్తున్న 440 బెడ్ల ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు సొంతిళ్లు

షాబాద్/ చేవెళ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లయినా కట్టివ్వలేదని, కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మించి ఇస్తూ పేదల్లో ఆనందాన్ని నింపుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం షాబాద్ మండలం ఏట్లఎర్రవల్లిలో నరాల కవిత నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గుడి చంద్రశేఖర్‌లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, మధుసూదన్‌గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, సూర్యగౌడ్, మహేశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే చేవెళ్ల మునిసిపల్ పరిధి రామన్నగూడలో పోతిరెడ్డి అనిత-వీరేశం దంపతుల ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావణ్య-శంకర్, డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఫౌంటేన్ కాదు.. భగీరథ పైప్‌లైన్



యాలాల మండలం లక్ష్మీ నారాయణపూర్ - బషీరాబాద్ మార్గంలో జుంటు వాగు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ జాయింట్ విడిపోయి పైప్‌లైన్ నుంచి నీరు ఉవ్వెత్తున ఆకాశానికి ఎగిసిపడింది. దీంతో మార్గంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంట పాటు ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరాను నిలిపివేయడంతో నీటి ఉధృతి తగ్గింది. అనంతరం వారు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. - యాలాల, నవంబరు24, (ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జామ్

బ్రిడ్జి పనుల కారణంగా సర్వీసు రోడ్డు మీదుగా వాహనాల తరలింపు

- డీజిల్ ట్యాంకర్ చెడిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం
- ఐదు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు


ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

ఘట్‌కేసర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక ఔటర్ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో వాహనాలను జాతీయ రహదారి సర్వీసురోడ్ల మీదుగా మళ్లించారు. స్థానిక ఎరిమల్లె వాగు సమీపం నుంచి ఔటర్ బ్రిడ్జి వరకు వాహనాలను రెండు వైపులా సర్వీసు రోడ్లపై నుంచి వెళ్లేవిధంగా చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం హెచ్‌పీసీఎల్ వైపు నుంచి నగరం వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ చెడిపోయింది. ఇంకేముంది అసలే సాయంత్రం సమయం కళాశాల విద్యార్థులు, వివిధ పనులపై వెళ్లిన వారు, ఉద్యోగాలు ముగించుకొని ఇళ్లకు(నగరానికి) చేరే సమయం కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది, దీనికితోడు బ్రిడ్జిపనుల కారణంగా ప్రధానరోడ్డును మూసివేసి సర్వీసు రోడ్లపై నుంచి వాహనాలను మళ్లించారు. దీంతో నిమిషాల వ్యవధిలో ట్రాఫిక్ జామ్ అయింది. ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు చెడిపోయిన ట్యాంకర్‌ను గంటకు పైగా శ్రమించి అతికష్టం మీద పక్కకు తియించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నేటి (మంగళవారం) నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీని ఒకేసారి నిర్వహిస్తామని తెలిపారు. మండల, గ్రామ సమాఖ్యల నాయకులు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాల కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. కానీ ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దానిని పెద్దఎత్తున పునరుద్ధరించిందన్నారు. ఈ చొరవ రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని తెచ్చిపెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇప్పటికే రెండు, మూడు దశల్లో వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. కలెక్టర్లు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారని డిప్యూటీ సీఎం ప్రశంసలు గురిపించారు. మహిళలకు నాణ్యమైన చీరలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. రుణాల పంపిణీకి తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌డీవో సాంబశివరావు, హౌజింగ్ పీడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఒక్క సర్పంచ్ స్థానమైనా ఇవ్వరా?

- భగ్గుమన్న బీజేపీ నాయకులు
- ఆమనగల్లులో రహదారిపై ధర్నా


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలంలో ఒక్క సర్పంచ్ స్థానాన్నీ బీసీలకు కేటాయించలేదని బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. సోమవారం నిరసన చేపట్టారు. పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు ఎర్రవోలు శ్రీను, కర్నాటి విక్రమ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్‌దిష్టి బొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, బీజేవైఎం పార్లమెంట్ కన్వీనర్ రవిరాథోడ్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మప్రశాంత్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసగించిందన్నారు. మండలంలో 13 పంచాయతీలుంటే ఒక్కటైనా బీసీలకు కేటాయించలేదెందుకని ప్రశ్నించారు. బీసీలను ఈ సర్కార్ చేసిన నయవంచనకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ సింగ్, చెన్నకేశవులు, శ్రీధర్, శ్రీను, జగన్‌రెడ్డి, ఆనంద్, జి.శ్రీను, బుచ్చయ్య, రాఘవ, జంగయ్య, వెంకటయ్య, రామస్వామి పాల్గొన్నారు.

రాజశేఖర్ హత్య పాశవికం

షాద్‌నగర్ రూరల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : ఎర్ర రాజశేఖర్ హత్య పాశవికం అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎల్లంపల్లి వచ్చిన ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే హత్య జరిగిందని, అందువల్ల అందుకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలన్నారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కులాంతర వివాహంపై షాద్‌నగర్, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్లలో పంచాయితీలు జరిగాయన్నారు. రాజశేఖర్‌ను పథకం ప్రకారమే చంపారన్నారు. పోలీసుల అండతోనే రాజశేఖర్, చంద్రశేఖర్‌లపై దాడి చేశారని ఆరోపించారు. రాజశేఖర్‌ను లాక్కెళ్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో స్పందించ లేదని విమర్శించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేయాలన్నారు. ఆయనతో ఎమ్మార్పీఎస్ నాయకులు పి.నర్సింలు, దర్శన్, పెంటయ్య, జంగయ్య ఉన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

● చీరల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు



మంచాలలో చీరలు పంపిణీ చేస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. వివిధ గ్రామాల మహిళలకు సోమవారం ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేశారు. అనంతరం 247 మహిళా సంఘాలకు రూ.14.44కోట్ల రుణాల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వి.హన్మంతరెడ్డి, ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఏపీఎం శేఖర్, మాజీ ఎంపీటీసీ ఎడ్మ నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, జెనిగె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం: మహిళలను ఆర్థిక వృద్ధిలోకి తేవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారంలో మహిళలకు చీరలు



ఆమనగల్లులో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులను చేసేలా వారు కోరినన్ని రుణాలిచ్చి ఆదుకుంటున్నామన్నారు. ఉపాధి పథకాలతో వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గతంలో నాణ్యత లేని చీరలిచ్చారని, నేడు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఎంపిక చేసిన చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. 18ఏళ్లు నిండిన మహిళలందరికీ ఈ చీరలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, ఎంపీడీవో రాధారాణి, ఇందిర క్రాంతి ఏపీవో రవీందర్, ప్రత్యేకాధికారి మాధవరావు తదితరులున్నారు.

చేవెళ్ల: ఎమ్మెల్యే యాదయ్య మండల పరిషత్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అధికారులతో కలిసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రతీ ఇంటికి చీరలు అందించే బాధ్యత మహిళా సంఘాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, ఏపీఎం భీమయ్య, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, ప్యాక్స్ చైర్మన్లు డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్, నాయకులు జనార్దన్‌రెడ్డి, బండారు శైలజాఆగిరెడ్డి, ప్రభాకర్, భీమయ్య, లావణ్యశంకర్, వీరేందర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండుయాదవ్, నరేందర్, శంకర్, సాయినాథ్, యాదయ్యగౌడ్, సమాఖ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చేవెళ్లలో మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల పరిషత్‌లో ఎమ్మెల్యే యాదయ్య చీరలను పంపిణీ చేశారు. మహిళలందరికీ చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో వెంకయ్య, ప్రజాప్రతినిధులు అధికారులు ఉన్నారు.

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి: మహిళా సాధికారత, సంక్షేమం, రక్షణకు పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో మహిళలు అండగా నిలవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పిలుపు నిచ్చారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కడితే మరింత అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఎంపీ, ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించారు. మహిళా సంఘాలకు మంజూరైన 34,560 ఇందిరమ్మ చీరలను ఏఎంపీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో పంపిణీ చేశారు. సమావేశాల్లో రవి మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ చీరలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థికస్వావలంబనే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, డీపీఎం యాదయ్య, ఏపీఎంలు నీరజ, రామస్వామి, రాములు,మహిళాసంఘాల అధ్యక్షురాళ్లు శోభ, మల్లమ్మ, కుమారి, సీసీలు మహేందర్, దీప, విజయలక్ష్మి, వసంత, రామయ్య, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

మాడ్గుల: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల రైతు వేదికలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మండలానికి 22వేల చీరలు వచ్చాయని, వాటిని మహిళలకు అందజేస్తామని తెలిపారు. తహసీల్దార్ వినయ్‌సాగర్, ఎంపీడీవో విజయలక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌గౌడ్, పాండుగౌడ్, సాయిరెడ్డి, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్: మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్‌లో చీరలను పంపిణీ చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 92వేల మంది మహిళలకు చీరలను పంపిణీ చేస్తామని చెప్పారు. మొదటి విడత 50వేల చీరలు వచ్చాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులతో చీరలను నేయించి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ జోసఫ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచనకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్, ఎంపీడీఓలు బన్సీలాల్, అరుంధతి, సుమతి పాల్గొన్నారు. అలాగే 40లక్షలతో ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రహరీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు ఒకటో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్య బలోపేతం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, పి.జగదీశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, టి.విశాలశ్రవణ్‌రెడ్డి, చెన్నయ్య, జమృద్‌ఖాన్, బస్వం, ఇబ్రహీం, సర్వర్‌పాషా, మోహన్, సి.రాజేందర్‌రెడ్డి, రఘునాయక్ పాల్గొన్నారు.

కందుకూరు: మహిళలకు ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తోందని మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం డీఆర్డీవో, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌లతో కలిసిచీరల పంపిణీ ప్రారంభించారు. డీఆర్డీవో శ్రీలత మాట్లాడుతూ..19ఏళ్లు నిండిన ప్రతీ మహిళను డ్వాక్రా సంఘాల్లో చేర్పించాలనే లక్ష్యంతో సంఘాల ప్రతినిధులు పనిచేయాలన్నారు. దివ్యాంగ మహిళలు, వృద్ధులను సైతం డ్వాక్రా సంఘాలుగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీడీవో సరిత, ఏపీఎం నరేందర్‌రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శోభ, ఏఎంసీ డైరెక్టర్లు యుగేందర్‌గౌడ్, పుష్ప పాల్గొన్నారు.



మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



కందుకూరు: చీరలను అందజేస్తున్న కృష్ణానాయక్, అధికారి శ్రీలత

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ క్కరి బాధ్యత అని సీడీపీవో శాంతిరేఖ అన్నారు. బాల్య వివాహాలను జరిపించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నారు. ఆమనగల్లులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌వో పద్మజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీవో, సీఐ జానకిరామ్, ఎంపీడీవో మాధురి, ఎస్సై వెంకటేశ్ హాజరయ్యారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాల గురించి విద్యార్థినుల లఘు నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. బాలికలను చదివిద్దాం, బాలికలను రక్షిద్దామని ప్రతిజ్ఞ నిర్వహించారు. బాల్య వివాహాలకు ఎదురు చెప్పాలని, చదువుపై దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీ వినోద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనిత, తిరుమల, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

‘బీసీలను మోసం చేసిన కాంగ్రెస్’

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అన్ని విధాలా మోసగించిందని బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్ ఆరోపించారు. ఆమనగల్లులో 13గ్రామ పంచాయతీలకు ఒక్క పంచాయతీ కూడా బీసీలకు కేటాయించకుండా అధికార పార్టీ నాయకులు కుట్ర చేశారని మండిపడ్డారు. ఆమనగల్లులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీసీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకుంటుందన్నారు. 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్తూ మోసగించిందని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు కడారి పెద్దయ్య, డేరంగుల వెంకటేశ్, వరికుప్పల గణేశ్, మహేశ్, శివ, నిరంజన్, రమేశ్ ఉన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

కడ్తాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజ శాంతిని కాంక్షించి ప్రతీ ఒక్కరూ దైవచింతనతో ముందుకుసాగాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. మైసిగండి శివాలయంలో మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప ఇరుముడి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జైపాల్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, నాయకులు హరిచంద్ నాయక్, రమేశ్ నాయక్, పాండునాయక్, రాజు, జగన్, నాగార్జున, అయ్యప్ప, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

మంచాల, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ శ్రేణులకు పిలుపునిచ్చాడు. సోమవారం మంచాలలోని శర్వంజీ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ మండల కమిటీ, జిల్లా స్థాయి ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమాయత్తం కావాలన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.

అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

కడ్తాల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాలలో మహిళాభ్యున్నతికి అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాల చంద్రస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు నెలల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శిక్షణ పొందిన 40మంది మహిళలు కుట్టు వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. సబ్సిడీపై 36 కుట్టు మిషన్లను సంస్థ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. పేద మహిళల ఆర్థికాభివృద్ధికి అభయ ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ కృష్ణవేణి, కో-ఆర్డినేటర్ మంగ, శిక్షకురాలు విజయ, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబ, మహిళా సంఘాల, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

రిజర్వేషన్లు ఖరారు

(ఐదో పేజీ తరువాయి)

జనరల్ 237 స్థానాల్లో మహిళలకు 112, జనరల్ 125 స్థానాలను కేటాయించారు.

వేడెక్కిన రాజకీయం..

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపు పూర్తయ్యింది. త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల్లో పార్టీ గుర్తులు లేకపోయినా పార్టీలే ప్రభావితం చేస్తాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీకి ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ మద్దతు పొందేందుకు ఎక్కువ మంది పోటీపడుతున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. నాయకులను వెంటబెట్టుకుని ప్రయత్నాలు చే స్తున్నారు. బీఆర్ఎస్ నుంచి పోటీకి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కలుస్తున్నారు. ఇక బీజేపీ శ్రేణులు కూడా పోటీకి సై అంటున్నాయి. పట్టున్న స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టే ప్రయత్నంలో సీపీఎం ఉంది. బీఎస్పీ, సీపీఐలు కూడా తమకు అనుకూలంగా ఉన్న పంచాయతీలపై దృష్టి సారించాయి. మొత్తంగా ఈ ఎన్నికలు హాట్‌హాట్‌గా జరిగే అవకాశం ఉంది.

ఎన్నికలపై ‘రియల్’ ప్రభావం

జిల్లాలో పంచాయతీ ఎన్నికలపై రియల్ ఎస్టేట్ ప్రభావం ఉండనుంది. ఆర్థిక మాంద్యంతో కొంతకాలంగా రియల్‌ఎస్టేట్ ఊపు తగ్గింది. అయినా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలకునేవారు పరిస్థితులను బట్టి డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పార్టీలు కూడా అంగబలం, అర్థబలం, పలుకుబడి ఉన్నవారినే ఎన్నికల్లో నిలపాలని చూస్తున్నాయి. అలాంటి వారి గురించి ఆరా తీస్తున్నాయి. ముఖ్యంగా మహిళల స్థానాలపై ఫోకస్ పెడుతున్నారు. అధికార కాంగ్రెస్ బీసీలకు 42శాతం రిజర్వేషన్ అనేది ముందేసుకున్నా ఈ ఎన్నికల్లో సాధ్యపడకపోవడంతో పంచాయతీల్లో పరిసితులను బట్టి ఎక్కువ శాతం బీసీ అభ్యర్థులను నిలపాలనే ఆలోచనలో ఉంది. చాలావరకు గతంలో ఉన్న రిజర్వేషన్లు తారుమారవడంతో ఎక్కువగా కొత్తగా అభ్యర్థులు రంగంలో దిగనున్నారు. కొన్నాళ్లుగా ఆశావహులు తమ మద్దతుదారులను కూడగట్టుకుని పట్టు సాధించే పనిలో ఉన్నారు. ముందుగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగితే ఇంత పోటీ ఉండేది కాదు. వీలైనంతమేర ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారు.

వైభవంగా మహాపడి పూజ

కడ్తాల్: ముద్విన్, మైసిగండి గ్రామాల్లో సోమవారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి హాజరయ్యారు. ముద్విన్‌లో పట్నం శ్రీనుగౌడ్, మైసిగండి శివాలయంలో కడ్తాల మాజీ ఎంపీపీ బి.ఆనంద్‌ల ఆధ్వర్యంలో చంద్రమోహన్‌నాయర్ గురుస్వామి, ముకుంద గురుస్వాముల పర్యవేక్షణలో 18 మెట్ల పడిపూజ ఘనంగా నిర్వహించారు.

కొందుర్గులో వాహనాల తనిఖీ

కొందుర్గు: కొందుర్గులో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ రాత్రి వేళలో వాహనాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సోమవారం రాత్రి ఆయన కొందుర్గు పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. కొందుర్గు మీదుగా కర్నాటక, మహారాష్ట్ర వాహనదారులు పయనిస్తుంటారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు, భారీ వాహనాలను సైతం నిలిపి వారి లైసెన్స్‌లను తనిఖీ చేశారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

తలకొండపల్లి: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్ అన్నారు. తలకొండపల్లిలోని అంబేద్కర్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను ఇస్తామని, చివరికి ఉన్న రిజర్వేషన్‌ను తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని విమర్శించారు. మండలంలో 2019లో బీసీలకు 6 సర్పంచ్ స్థానాలు ఉంటే ఈ సారి 4 స్థానాలనే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. లింగారవుపల్లిలో బీసీలకు ఒక్క వార్డు రిజర్వేషన్ రాలేదని, ఆ గ్రామంలో బీసీలు లేరా? అన్నారు. ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లపై ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా కార్యదర్శి జోలం వెంకటయ్య, లింగంగౌడ్, బాలకుమార్‌గౌడ్, రమేశ్, దేవేందర్ యాదవ్, ఆంజనేయులు, పాండు, మల్లేశ్, అంజి పాల్గొన్నారు.

పాఠశాలలకు చేయూత అభినందనీయం

షాబాద్:ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల చేయూత అభినందనీయమని షాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో నాగర్‌గూడకు చెందిన తాళ్ల శ్రీనివాస్ గౌడ్ కిచెన్‌షెడ్‌ను కటించారు. పాఠశాలకు దాత బల్వంతరెడ్డి బ్యాండ్‌ను అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరమని, శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, హెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌గౌడ్, కృష్ణయ్య, గ్రామస్తులు ఉన్నారు.

సంక్షిప్తంగా

● **ఆమనగల్లు:** మండలంలోని చింతలపల్లికి చెందిన సుఖమేటి వెంకటేశ్వర్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.36వేలు మంజూరు అయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కును సోమవారం కేఎస్ఆర్ సేవా దళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా అందజేశారు.

● **శంకర్‌పల్లి:** మండలంలోని అప్పారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రాణ హస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్స్‌లను అందించారు. వైద్యశిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని వైద్యులు వినయ్ తెలిపారు. హెచ్ఎం సదాలక్ష్మి, టీచర్లు తాహెర్‌అలీ, మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

● **కేశంపేట:** అన్నదానం మహాదానమని కేశంపేటకు చెందిన తలసాని బాల్‌రెడ్డి అన్నారు. ధవళగిరి వేంకటేశ్వరస్వామి అలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు బాల్‌రెడ్డి-అరుణమ్మ దంపతులు అన్నదానం చేశారు. గురు స్వాములు, తిరుమలేశ్‌గౌడ్, రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యుగంధర్, గోపాల్, మహేష్, మనోహర్, శివ, పవన్‌కుమార్ రెడ్డి, చందు, పాండు, రవి పాల్గొన్నారు.

● **చేవెళ్ల:** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంగా మారిందని మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్ అన్నారు. పలుగుట్టకు చెందిన పీసరి నగమణికి రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు రాములు, పాండుయాదవ్, నరేందర్, ప్రభాకర్, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

● **చౌదరిగూడ:** బాలికలను చదివించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. లాల్‌పహాడ్ కేజీబీవీలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై చర్చించారు. బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు పాఠశాల ప్రత్యేక అధికారి రాఘసుధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి, గీత, జ్యోత్స్న, పద్మ, అంగన్వాడీ టీచర్ సుల్తానా పాల్గొన్నారు.

● **కేశంపేట:** బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ అన్నారు. పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో బేటీ బచావో భేటీ పడవో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లితండ్రులు ఆడబిడ్డలను చదివించాలని సూచించారు. కొందరు అమ్మాయిలకు త్వరగా పెళ్లిళ్లు చేస్తారని, ఇలా చేయడం చట్టరీత్యా నేరమని వివరించారు. వ్యాసరచనపోటీ నిర్వహించి, బహుమతులు అందించారు. హెచ్ఎం శ్రీశైలం, టీచర్లు గోపాల్‌రెడ్డి, సూర్యకాంత్, సువర్ణ, శ్రీదేవి, శ్రీశైలం, లావణ్య, నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, భారతి, సుమతి, లక్ష్మి పాల్గొన్నారు.

● **కందుకూరు:** స్వాతంత్ర్యోద్యమంలో యువతను ప్రోత్సహించడంలో వందేమాతరం గీతం కీలక భూమిక పోషించిందని బీజేపీ శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు. కందుకూరు నోబుల్ స్కూల్‌లో వందేమాతరం గేయ 150 సంవత్సరాలు ఉత్సవాలను నిర్వహించారు.

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

ఆదిభట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఇబ్రహీంపట్నం మండలంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్ర కారం.. ఆదిభట్ల మున్సిపల్ ఎంపీపటేల్ గూడకు చెందిన బొమ్మరాజు రాజు(35) తన బైక్‌పై మంగల్‌పల్లి నుంచి బొంగ్లూర్ వైపు వెళ్తూ కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో దూకి మహిళ బలవన్మరణం



సావిత్రమ్మ మృతదేహం

ఇబ్రహీంపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో సోమవారం మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు యాచారం మండలం నందివనపర్తి గంటోని బావికి చెందిన మూడెడ్ల సావిత్రమ్మ(57)గా గుర్తించారు. చెరువు తూము వద్ద మృతదేహాన్ని గుర్తించి 100కు కాల్ చేయడంతో పోలీసులు వెళ్లి వెలికి తీశారు. సావిత్రమ్మ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేలింది. సావిత్రమ్మకు భర్త నర్సిరెడ్డి, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



వసురాం(ఫైల్)

మాడ్గుల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లు తండాకు చెందిన మేరావత్ వసురాం అదృశ్యమయ్యాడు. ఆదివారం రాత్రి బయట చేపలు కొని తెస్తానని తన తండ్రి లాలు వద్ద వంద రూపాయలు తీసుకొని వెళ్లిన అతడు తిరిగి రాలేదు. తన భర్త కన్పించడంలేదని వసురాం భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

మాజీ ఎంపీపీ మృతి బాధాకరం



నివాళులు అర్పిస్తున్న అంజయ్యయాదవ్

కేశంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేశంపేట మాజీ ఎంపీపీ, లేమామిడికి చెందిన దిద్దెల ముత్యాలు మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం లేమామిడి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతదేహానికి నివాళులు అర్పించారు. మాజీ జెడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి ముత్యాలు కుటుంబాన్ని పరామర్శించారు. మండల పరిషత్ వద్ద కార్యాలయ సిబ్బంది మాజీ ఎంపీపీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు శ్రీశైలంగౌడ్, మురళీధర్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు

చేవెళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు విడుదల చేస్తుందని ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలో పీఆర్ నిధులు రూ.3.74 కోట్లతో ముడిమ్యాల్-మల్కాపూర్ బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో మండల పీఆర్ డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, హరికిషన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు స్వరూప, సుమాలత, నాయకులు సాయినాథ్, శ్రీనివాస్‌గౌడ్, వాజీద్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్, సతీష్, మల్లేష్, రాంచంద్రయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

వందేమాతరం గేయంతో దేశంలో ఐక్యత

కేశంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం దేశ ఐక్యతకు ఉపయోగపడిందని మాజీ వైస్ ఎంపీపీ నరసింహయాదవ్ అన్నారు. సోమవారం కేశంపేట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి జాతీయ గేయాన్ని ఆలపించారు. 150ఏళ్ల కింద ఈ గేయం నాటి ప్రజల్లో ఐక్యతను చాటిందన్నారు. ఈ గేయం స్ఫూర్తితో యువత ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, వందేమాతరం మండల కన్వీనర్ యుగంధర్, సాంస్కృతిక శాఖ జిల్లా కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డి, కుమార్‌గుప్తా, పవన్‌కుమార్‌రెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో బడ్వైజర్ అవుట్‌లెట్ ప్రారంభం



శంషాబాద్ రూరల్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి)తి: శంషాబాద్ విమానాశ్రయంలో బడ్వైజర్ నూతన అవుట్‌లెట్‌ను సోమవారం జీఎంఆర్ డిప్యూటీ సీఈవో, గెయిల్ అధికారులు ప్రారంభించారు. బస్ బోర్డింగ్ గేట్ 121 ప్రాంతంలో దీనిని ప్రారంభించినట్లు జీఎంఆర్ పేర్కొంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులకు అనుగుణంగా వసతులు కల్పిస్తామని డిప్యూటీ సీఈవో తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర నియంత్రణ

కేశంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరలను నియంత్రించొచ్చని కేశంపేట సీఐ నరహరి అన్నారు. నిర్ధవెల్లిలో సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించిన పాఠశాల పూర్వ విద్యార్థి కమ్మరి రవి కుమార్‌ను అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో మరింత భద్రత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. చంద్రశేఖర్ రెడ్డి, షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, గ్రామస్తులు శ్రీశైలం, ముత్యాలు, ఖాజాపాషా, రామకృష్ణ, చంద్ర, మునీర్, జంగయ్య, యాదయ్య, పోలీసులు ఆశోక్ రెడ్డి, పురుషోత్తం, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మేకలు, గొర్ల మందల వద్ద కాపలా ఉండాలి

యాచారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ పశువుల కొట్టాల వద్ద, మేకల, గొర్ల మందల వద్ద భద్రత కల్పించుకోవాలని, దుండగులు వాటి చోరీకి పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యాచారం సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు ప్రజలను కోరారు. సోమవారం మాల్, తమ్మలోనిగూడ, చింతపట్ల, తక్కళ్లపల్లి గ్రామాల్లో పోలీసులు చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు కన్పిస్తే 100కు కాల్ చేయాలన్నారు. గొర్రెలు, మేకల మంద వద్ద, పశువుల దొడ్ల వద్ద కావలి పెట్టుకోవాలన్నారు. వాహనాలకు నంబర్‌ప్లేట్ లేకుండా తిరిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ప్రజలకు వివరించారు. విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.



తమ్మలోనిగూడలో దొంగతనాలపై ప్రజలకు వివరిస్తున్న పోలీసులు